అమ్మాయి ఉద్యోగం విషయం చెప్పకుండా ఉంటానా? మీరు ఉద్యోగం చేయని పిల్ల కావాలని చెప్పారు. వారి అమ్మాయితో ఉద్యోగం చేయించే ప్రసక్తి లేదని రాఘవరావుగారు నాతో ఎన్నోసార్లు చెప్పారు. అందుకే మీకు ఈ సంబంధం చెప్పాను. తీరా చూస్తే ఇప్పుడు ఆ పిల్ల ఉద్యోగంలో చేరిందంటున్నారు. సరే కానివ్వండి. మీ ఇద్దరికీ రాసిపెట్టి లేదనుకుంటాను'' అన్నారు శాస్త్రిగారు.

రాఘవరావు పెళ్ళికొడుకు వైపు తిరిగి ''బాబూ! మీకు అమ్మాయి ఉద్యోగం చేయటం ఇష్టం లేదా? అలాగైతే అమ్మాయిని ఉద్యోగం మాన్పిస్తాము'' అన్నారు.

''అవునండి. నా భార్యకు ఉద్యోగం చేయాల్సిన అవసరం ఉండదు. చక్కగా ఇంటిపట్టునే వుండి నన్నూ, ఇంటిని చూసుకుంటే చాలు. ఆడవాళ్ళకు ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏంటసలు? భర్త సంపాదన సరిపోతున్నా సరే వాళ్ళ జల్సాల కోసం ఉద్యోగాలు చేయటం మొదలుపెడుతున్నారు. ఇంటిని పిల్లలని గాలికి వదిలేసి బయట మగాళ్ళతో రాసుకుపూసుకు తిరుగుతూ దానికి సోషల్‌గా ఉండటం అని పేరు పెట్టుకుంటున్నారు. ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళకి నీతి నియమాలుండవనేది నా అభిప్రాయం.

సంపాదించే ఆడవాళ్ళు భర్తకు విలువివ్వకపోవటం నా స్నేహితుల విషయాల్లో చూసాను. అందుకే ఉద్యోగం చేసే పిల్లగానీ, ఉద్యోగం చేయాలనుకునే పిల్లకానీ వద్దనీ చెప్పాను. నా భార్య నాకు నచ్చినట్టు ఉండాలని కోరుకోవటం తప్పు కాదు కదా! మీ అమ్మాయితో ఉద్యోగం మాన్పిస్తామన్నారు. ఇకముందు భవిష్యత్తులో ఎప్పుడూ ఉద్యోగం మాట ఎత్తకూడదు. అందుకు మీ అమ్మాయి ఒప్పుకుంటే నాకు అభ్యంతరం లేదు'' చెప్పాడు ఆనంద్.

''కానీ నాకు అభ్యంతరం ఉంది'' అంతవరకు ప్రేక్షకురాలిగా వాళ్ళ మాటలు విన్న స్రవంతి నోట్లోంచి పిడుగుల్లా వచ్చిపడ్డాయి ఆ మాటలు. రాఘవరావు తేరుకుని కూతుర్ని వారించబోయారు.

తండ్రిని వారించి ''నాన్నా! ఇంతకాలం మీరు చెప్పినట్టే విన్నాను. ఉద్యోగం లేదని ఎన్ని పెళ్ళి సంబంధాలు తప్పిపోయినా బాధపడలేదు. ఉద్యోగంలో చేరిన తరువాత ఇప్పుడు వీళ్ళొచ్చి ఉద్యోగం వద్దంటే మీరు సరేనంటున్నారు. నేను ఆడపిల్లనే కానీ ఎలా ఆడమంటే అలా ఆడేపిల్లను కాను. ఒక లెక్చరరుగా ఎంతోమందికి పాఠాలు చెపుతున్న నేను నా జీవితాన్ని ఎలా కావాలో అలా తీర్చిదిద్దుకోగలను. ఇక ఎప్పుడూ పెళ్ళి చూపుల తతంగాలు ఏర్పాటు చేయవద్దు. నాకు నచ్చినవాడు తారసపడినప్పుడు సింపుల్‌గా పెళ్ళి చేసుకుంటాను'' అని పెళ్ళికొడుకు వైపు తిరిగి ''మిస్టర్ ఆనంద్! ఆడదంటే నీకెంత అలుసో అర్థమయింది. నువ్వనుకొంటున్నట్టు ఏ ఆడదీ జల్సాలకు ఉద్యోగం చేయదు. భర్త సంపాదన సరిపోక ధరలు మండుతున్న ఈ రోజుల్లో పిల్లల కనీసావసరాలు తీర్చాలనే తపనతో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ కాలం ఆడవాళ్ళు ఇంటా బయటా అష్టావధానం చేస్తున్న వాళ్ళని చూసి జాలిపడాలి. చేతనైతే సాయం చేయాలి. అంతేకానీ గడపదాటిన ప్రతి ఆడదీ శీలం చెడినదే అనుకోకూడదు. తప్పు చేయాలంటే ఆడది గడపదాటనవసరం లేదు. ఇక సంపాదించే ఆడది భర్తకు విలువ ఇవ్వదు అనుకోవటం నీ కుసంస్కారం. నీలాంటి కుసంస్కారికి భార్య అనే పేరుతో బానిసగా మారటం కన్నా జీవితాంతం పెళ్ళికాకుండా ఉండటమే మేలు. ఇంకెప్పుడూ ఆడవాళ్ళని కించపరిచి మాట్లాడకు. నీ తల్లికూడా ఆడదేనని గుర్తుంచుకో చాలు.'' చెప్పి లోపలికి వెళ్ళిపోయింది స్రవంతి.

నిశ్చేష్టులై ఉండిపోయారంతా.

**-ఐ.మాధవి (హైదరాబాద్)**

# (ప్ర) వృత్తి

''ఏమిటీ!..సూర్యా ఆర్ట్సు బిల్ ఇంతయిందా? ఏమిటో నాలుగు గీతలు గీసి..ఇన్ని వందల బిల్ వేయించుకుంటున్నారు..'' ఎగాదిగా సురేష్ తీసుకువచ్చిన బిల్‌ని చూస్తూ, కాష్‌బుక్‌లో ఎంట్రీ వేస్తూ అన్నాడు భార్గవ్.

చివుక్కుమంది సురేష్ మనసు. అసలు ఆర్ట్ అంటే వీళ్ళేమనుకుంటున్నారు? అన్ని డిపార్ట్‌మెంట్స్ పేర్లు, సెక్షన్‌ల పేర్లు, నాలుగు పెద్ద పెద్ద బోర్డ్‌లు రాయించుకుని తాను చెప్పిన అమౌంట్‌కి ఇంకా చాలా తగ్గించి బిల్ వేయించారు మేనేజర్‌గారు. ఎవరు ఎలా రాసినా అది ఆర్ట్ అవుతుందా? ఆయన రాయగలడా అలా? అయినా వీళ్ళకు అంతంత జీతాలిస్తున్నారు. వీళ్ళేమాత్రం పనిచేస్తున్నారని తానడుగలడా? అనలేడు, అడగలేడు. అనువుగాని చోట అధికుల మనరాదు. అంతేగాదు వారికి స్థానబలిమి వుంది. అయినా వారి పని తను చేయలేడు. తన పని వారు చేయలేరు. ఎవరి వృత్తి వారికే గొప్ప. కాని అలా తన వృత్తిని గీతలంటూ, ఉత్తి పుణ్యానికే అతని డబ్బే తనకిచ్చినట్లు వ్యవహరించడం సహించలేకపోయినా, ఎలాగో డబ్బు తీసుకుని బయటపడ్డాడు.

★ ★ ★

వర్షం బాగా పడుతుండటంతో స్కూటర్‌ను ఆపి ప్రక్కనే ఉన్న షాప్ చూరుకిందకు వెళ్ళి నిలబడ్డాడు భార్గవ్. అక్కడ ఇంకా ఐదారుగురు నిలబడి ఉన్నారు. ఆఫీస్‌కి వెళ్ళాల్సిన టైమ్ దాటి అప్పటికే అరగంటయిపోయింది. ఆఫీస్‌లోని పని గురించి ఆలోచిస్తూ, తగ్గని వర్షాన్ని చూస్తూ పరధ్యానంగా నిలబడ్డ భార్గవ్, ''అరె!..సర్..మీరా! తడుస్తున్నారు కదా సర్..రండి లోపలకు ఆఫీస్ టైంకి లేట్ అయిపోతున్నట్లుంది..'' అన్న పిలుపునకు వెనుతిరిగి చూసాడు భార్గవ్.

ఆరోజు సూర్యా ఆర్ట్సు బిల్ తీసుకున్న సురేష్.

''ఆ! వాళ్ళు వెళ్లిమాత్రం చేసేదేముందన్నా! నాలుగుసార్లు టీకెళ్ళడం, నాలుగు ముక్కలు పుస్తకాల్లో రాయడం అంతేగా!'' అన్నాడు అదే షాప్‌లో పనిచేస్తున్న వేరే అతను శేఖర్.

చుట్టూ అందరూ ఉండగా అలా అనేసరికి కోపం ముంచుకొచ్చింది భార్గవ్‌కి. అయినా వీళ్లకేం తెలుసు. రోజూ కాష్ బుక్ టాలీ కావడానికి, ప్రతినెలా స్టేట్‌మెంట్స్ పంపించడానికి తామెంత శ్రమపడాలో!

''శేఖర్! ఏంటా మాటలు? ఎవరి పని వారికే గొప్ప. ఎవరి వృత్తిలోని బాధలు వాళ్ళకే తెలుస్తాయి. అలా మాట్లాడటం తప్పుకదూ! సారీ సర్! మీరేమీ అనుకోకండి. కొత్తగా పనిలో చేరాడు. చిన్న వయసు..ఎలా మాట్లాడాలో తెలియదు. మీరు లోనికి రండి సర్! వేడి వేడి టీ తెప్పిస్తాను'' అంటున్న సురేష్ మాటలు భార్గవ్ అహంభావాన్ని అణచివేసాయి.

ఆరోజు అంతమందిలో అతని వృత్తిని కించపరుస్తూ మాట్లాడితే అతనూ ఇంత బాధపడ్డాడేమో! కాని అది తెలిసీ నేడు ఎవరి వృత్తివారికి గొప్పది, ఎవరి సాధక బాధకాలు వారివి అని తనంత చదువుకోకపోయినా అనగలిగాడు.

తన ప్రవర్తనకు అతీతంగా ఉన్న అతని సంస్కారానికి జోహార్లర్పిస్తూ తన ఆరోజు ప్రవర్తనకు సిగ్గుపడుతున్నట్లుగా తలవంచుకుని అతని చేయి ఆప్యాయంగా నొక్కివదిలాడు భార్గవ్ కృతజ్ఞతగా.

**-ఎస్.సుజనాదేవి (వరంగల్)**